● ప్రధాన కార్యదర్శి పదవి, 'రెండాకుల' చిహ్నం వ్యవహారం..

ఈపీఎస్‌కు హైకోర్టు ఝలక్



● ఈసీ విచారణకు గ్రీన్ సిగ్నల్

● సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం: మాజీ మంత్రి షణ్ముగం

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన కార్యదర్శి పదవి, రెండాకుల చిహ్నం తదితర అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలపై ఎన్నికల సంఘం (ఈసీ) విచారణ చేపట్టవచ్చని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. అంతేగాక ఎన్నికల సంఘం విచారణపై స్టే విధించాలని కోరుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) దాఖలుచేసిన పిటిషన్ తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.సుబ్రమణియన్, జస్టిస్ జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం జరిగిన పరిణామాల్లో బహిష్కరణకు గురైన సీనియర్ నేతలైన టీటీవీ దినకరన్ కొత్త పార్టీ ప్రారంభించగా, వీకే శశికళ.. తన మద్దతుదారులతో ప్రత్యేక వర్గంగా ఏర్పడ్డారు. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కూడా అన్నాడీఎంకేకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకేపై తనకు హక్కు వుందంటూ.. ఓపీఎస్ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఆ వినతిపత్రాన్ని పరిశీలించేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ మద్రాసు హైకోర్టులో సూర్యమూర్తి అనే వ్యక్తి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. ఈపీఎస్ హైకోర్టులో అప్పీలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల సంఘం విచారణపై స్టే విధించింది. అయితే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఓపీఎస్ కుమారుడు రవీంద్రనాథ్, పుహళేంది, రామ్‌కుమార్ ఆదిత్యన్, రామ్‌కుమార్‌లు వేర్వేరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై గత వారం న్యాయమూర్తులు ఆర్.సుబ్రమణియన్, జి.అరుళ్‌మురుగన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్టీ నిబంధనల సవరణ, కొత్త అధిష్ఠానం ఎంపిక తదితర విషయాలు పార్టీ అంతర్గత వ్యవహారాలని, వీటిలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోలేదని ఈపీఎస్ తరపు న్యాయవాది వివరించారు. హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా అన్నివర్గాల అభిప్రాయాలు తెలుసుకొనేలా అందరికి నోటీసులు జారీచేశామని ఎన్నికల సంఘం తరపున హాజరైన న్యాయవాది తెపారు. అదే సమయంలో, రవీంద్రనాథ్, పుహళేంది, రామ్‌కుమార్ సహా ఆరుగురి తరపున హాజరైన న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఓపీఎస్ పార్టీ జెండా వినియోగించడంపై ఈసీ నిషేధం విధించినా, ప్రస్తుతం పరిస్థితులు మారాయని, అధిక శాతం కార్యకర్తలు ఆయనకే మద్దతు తెలుపుతున్నారని వివరించారు. అందువల్ల ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం విచారణ అడ్డుకోలేరన్నారు. పార్టీ నిబంధనల్లో సవరణలు చేశారని, కొత్త ప్రధాన కార్యదర్శి ఎంపిక తదితరాలు కూడా పార్టీ నిబంధనల అతిక్రమణ కిందకే వస్తాయన్నారు. అందరి వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల సంఘం విచారణ చేపట్టిందని, ఈ విచారణపై వున్న స్టే తొలగిస్తున్నట్లు ప్రకటించింది.

ఎన్నికల సంఘానికి అధికారం లేదు : సీవీ షణ్ముగం

పార్టీ అంతర్గత వ్యవహారాల్లో విచారణకు ఎన్నికల సంఘానికి అధికారం లేదని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి, రాజ్యసభ ఎంపీ సీవీ షణ్ముగం తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులపై బుధవారం ఆయన స్పందిస్తూ... పార్టీల నమోదు, పార్టీ పదవుల్లో జరిగే మార్పులు నమోదుచేయడం మాత్రమే ఎన్నికల సంఘం విధులన్నారు. పార్టీ నుంచి బహిష్కరణకు గురైనవారు, పార్టీలో సభ్యులుగా లేని వారు న్యాయస్థానంలో పిటిషన్ వేశారన్నారు. అలాంటి వారిచ్చే వినతిపత్రాలు పరిశీలించరాదని అప్పుడే ఎన్నికల సంఘానికి తెలిపామన్నారు. ఎన్నికల సంఘంపై తామెప్పుడూ విమర్శలు చేయలేదని, కానీ లేని అధికారంతో విచారణ చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. తమ వాదనలను కూడా న్యాయస్థానం పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. తీర్పు పూర్తి వివరాలు అందిన తర్వాత ఈ విషయమై తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల సంఘం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

చివరకు ధర్మమే గెలుస్తుంది : ఒ.పన్నీర్‌సెల్వం

ధర్మమే చివరకు గెలుస్తుందని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వ్యాఖ్యానించారు. మద్రాసు హైకోర్టు బుధవారం ఇచ్చిన తీర్పుపై పన్నీర్‌సెల్వం స్పందిస్తూ... న్యాయస్థానానికి ఎలాంటి అధికారాలున్నాయో, అవే అధికారాలు ఎన్నికల సంఘానికి కూడా ఉంటాయన్నారు. ఈ విషయమై పళనిస్వామి పిటిషన్ న్యాయస్థానం తోసిపుచ్చిందని, ఎంతలా అణిచివేసినా చివరకు ధర్మమే జయిస్తుందన్నారు.

రాష్ట్రంలో 'సీఎం ఫార్మసీలు'

● తొలి దశలో 1000

● చెన్నై నగరంలో 33

● 24న ప్రారంభించనున్న స్టాలిన్



మెరీనాబీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం స్టాలిన్

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ధరకే జనరిక్ మందులను విక్రయించేలా ప్రభుత్వం 'సీఎం ఫార్మసీ'లను నెలకొల్పనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి షాపులను ప్రారంభించనుంది. వీటిలో చెన్నై నగరంలోనే 33 షాపులున్నాయి. ఈ నెల 24వ తేదీ తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో సీఎం ఫార్మసీ షాపును ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. గత యేడాది ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అతి తక్కువ ధరకే జనరిక్ మందులను అందజేసేలా రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి సీఎం ఫార్మసీలను నెలకొల్పుతామని సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ తర్వాత అక్టోబరు 29న ఈ ఫార్మసీ షాపుల ఏర్పాటు, విధి విధానాలపై సీఎం సారథ్యంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సీఎం ఫార్మసీలు, జిల్లా స్థాయిల్లో మందుల గోదాముల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఆ తర్వాత ఈ షాపుల కోసం మొత్తం 2 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించిన తర్వాత 840 మంది ఈ షాపుల ఏర్పాటుకు అర్హత ఉన్నట్టు అధికారులు తేల్చారు. వీరికి సహకార శాఖ తరపున షాపుల కేటాయింపు జరుగుతోంది. ఈ నెల 24వ తేదీన సీఎం స్టాలిన్ వీటిని ప్రారంభించనున్నారు. నగరంలో కొళత్తూరు, టి.నగర్, ఆళ్వార్‌పేటతో పాటు సహా మొత్తం 33 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ షాపులకు అవసరమైన జనరిక్ మందులను తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ సరఫరా చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా షాపుల ఏర్పాటుకు బిఫార్మ్ లేదా డిఫార్మ్ పూర్తిచేసిన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను "www.mudhalvarmarunthagam.tn.gov.in' అనే వెబ్‌సైట్‌లో పంపించాల్సి ఉంటుంది. ఈ షాపుల ఏర్పాటుకు ఉన్న విధి విధానాలు, నియమ నిబంధనలు, ఇతర వివరాలను ఈ వెబ్‌సైట్‌లోనే చూసి తెలుసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

లైంగిక వేధింపులను నిరోధించాల్సిందే

● పోలీసులకు సీఎస్ స్పష్టీకరణ



పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వేధింపులను నిరోధించాల్సిందేనని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం బుధవారం పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హోంశాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్ జివాల్, ఏడీజీపీ జయరామ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదుచేయాలని, పోలీసులు ముమ్మరంగా గస్తీ తిరగాలని సీఎస్ ఆదేశించారు. శాంతిభద్రత పరిరక్షణ విషయంలో రాజీ పడవద్దని, విధ్వంసకారులు, అత్యాచారాలకు పాల్పడేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

టీవీకేలో అనుబంధ విభాగాలు

● ప్రకటించిన అధ్యక్షుడు విజయ్



అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) బలోపేతంలో భాగంగా కొత్తగా 28 అనుబంధ విభాగాలను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవలే రెండో యేడాదిలోకి అడుగుపెట్టిన టీవీకేను 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై విజయ్ దృష్టిసారించారు. ఇందులో భాగంగా తాజాగా 28 అనుబంధ విభాగాలను ఏర్పాటు చేశారు. ఇప్పటిరకు ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా హిజ్రాలకు కూడా ఓ విభాగాన్ని టీవీకేలో ఏర్పాటు చేయడం గమనార్హం. ఆ పార్టీ విభాగాలను ఓసారి పరిశీలిస్తే మీడియా వింగ్‌తో పాటు ఐటీ, న్యాయవాదులు, ప్రచార, ప్రతినిధులు, సభ్యత్వ నమోదు, శిక్షణ, కార్యకర్తల నైపుణ్య అభివృద్ధి, పర్యావరణం, హిస్టరీ, రీసెర్చ్, ఇన్ఫర్మేషన్, హిజ్రాల వింగ్, దివ్యాంగులు, యువజన, విద్యార్థి, మహిళలు, యువతులు, చిన్నారులు, కార్యకర్తలు, వ్యాపారులు, జాలర్లు, చేనేత కార్మికులు, పదవీ విరమణ, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులు, వైద్యం, రైతులు, సాంఘిక, సంస్కృతి, సాంప్రదాయం, స్వచ్ఛంధకారులు, అఖిల భారత దళపతి విజయ్ మక్కల్ ఇయ్యక్కం వంటి మొత్తం 28 విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ జాబితాను భారత ఎన్నికల సంఘానికి టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సారథ్యంలోని టీవీకే బృందం సమర్పించనుంది.

టీవీకేకు 20 శాతం ఓటు బ్యాంకు?

ఇటీవలే ఆవిర్భవించిన టీవీకేకు రాష్ట్రంలో 20 శాతం ఓటు బ్యాంకు వుందంటూ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నివేదిక సమర్పించారని, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. అయితే దీనిని రాజకీయ విశ్లేషకులు మాత్రం కొట్టిపారేస్తున్నారు. స్థాపించి ఏడాది కూడా కాని పార్టీకి అంత ఓటు బ్యాంకు ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. సీనియర్ వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ పేరుతో టీవీకే నిర్వాహకులు ప్రచారం చేసుకుంటున్నారని వారు విమర్శిస్తున్నారు.

త్వరలో ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ

● డీఎంకే కూటమి నుంచి నలుగురు

● అన్నాడీఎంకే, పీఎంకేల నుంచి చెరొకటి

● ఈసారి కమల్‌కు రాజ్యసభ ఖాయం!

● రాష్ట్రంలో ఈ ఎన్నికలతో కొత్త పొత్తులకు నాంది!



కమల్‌ను సత్కరిస్తున్న పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు నెలల్లో రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. డీఎంకే కూటమి నుంచి నాలుగు, అన్నాడీఎంకే, పీఎంకే నుంచి ఒక్కొక్కటి చొప్పున ఖాళీ అవుతుండగా, ఇందులో డీఎంకే కూటమి స్థానాలు యధాతథంగా వుంటాయి. అయితే ఈసారి అన్నాడీఎంకే లాభపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ పార్టీతో సంధి కుదుర్చుకోని పక్షంలో పీఎంకే రాజ్యసభ స్థానాన్ని కోల్పోయే అవకాశాలున్నాయి. అయితే 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్ఎం) అధినేత కమల్‌కు మాత్రం ఈ సారి రాజ్యసభ స్థానం ఖాయమని డీఎంకే వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో ఈ సారి జరిగే రాజ్యసభ ఎన్నిక కొత్త పొత్తులకు నాందీ పలుకనుంది.

ఆ ఆరుగురు ఎవరంటే..?

రాష్ట్రం నుంచి 18 మంది రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి 2 సంవత్సరాలకొకసారి రొటేషన్ ప్రాతిపదికన ముగిసే ఎంపీల్లో మూడింట ఒక వంతుమంది పదవీ కాలం ముగుస్తుంది. ఇందులో భాగంగా వచ్చే జూలై 24వ తేదీతో ఆరు స్థానాలు ఖాళీ కానున్నాయి. డీఎంకే నుంచి ఎంఎం అబ్దుల్ల, ఎం.షణ్ముగం, హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.విల్సన్, ఎండీఎంకే అధినేత వైగో, అన్నాడీఎంకే నుంచి ఎన్.చంద్రశేఖరన్, పీఎంకే నుంచి అన్బుమణి స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

ఎవరికెన్ని స్థానాలు?

ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలాన్ని బట్టి డీఎంకేకు నాలుగు స్థానాలు యధాతథం కాగా, అన్నాడీఎంకేకు మాత్రం ఒకటి కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. 2019లో జరిగిన రాజ్యసభ ఎన్నికల నాటికి పీఎంకే అన్నాడీఎంకే కూటమిలో వుంది. దాంతో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణిని రాజ్యసభకు పంపేందుకు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి(ఈపీఎస్) అంగీకరించారు. అయితే ప్రస్తుతం పీఎంకే అన్నాడీఎంకే కూటమిలో లేనందున ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు అన్నాడీఎంకేకు అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

కొత్త పొత్తులకు బీజం పడనుందా?

జూలైలో జరిగే రాజ్యసభ ఎన్నికలు రానున్న అసెంబ్లీ ఎన్నికల కొత్త పొత్తులకు మార్గం కానున్నాయి. తమ కూటమికి చెందిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడు తాముంచుకుని, ఒకటి తమ మిత్రపక్షమైన ఎండీఎంకేకు ఇవ్వాలని ఇప్పటికే డీఎంకే నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే అన్నాడీఎంకేకి ఒక స్థానం ఖాయం కాగా, రెండో స్థానం కూడా దక్కాలంటే ఇతర పార్టీల సహకారం తీసుకోవడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. ప్రస్తుతం అసెంబ్లీలో అన్నాడీఎంకే బలం 66 వుంది. రెండు స్థానాలు దక్కించుకునేందుకు ఇది సరిపోతుంది. కానీ అసమ్మతి ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు పక్కచూపులా చూసినా రాజ్యసభ స్థానాన్ని నష్టపోవడం ఖాయం. కాగా పీఎంకేకు 5, బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నందున ఆయా పార్టీల మద్దతుతో రెండో స్థానాన్ని చేజిక్కించుకోవడం అన్నాడీఎంకేకి సులభం. కానీ అందుకు ఆ రెండు పార్టీలు సహకరిస్తాయా? లేక ఆ రాజ్యసభ స్థానాన్ని తమకే ఇస్తే, అసెంబ్లీ ఎన్నికల్లో సహకరిస్తామని చెబుతాయా అన్నది తేలాల్సి వుంది. ఏది జరిగినా అన్నాడీఎంకే కూటమిలో అసెంబ్లీ ఎన్నికల పొత్తులపై జూలైలోనే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఒక రాజ్యసభ స్థానం తమకే ఇవ్వాలని బీజేపీ నుంచి ఇప్పటికే అన్నాడీఎంకేకు రాయబారం వెళ్లింది. మరోవైపు పీఎంకే కూడా ఒక స్థానాన్ని ఆశిస్తోంది. డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలత కూడా ఒక స్థానాన్ని ఆశిస్తున్నారు. ఆమెను రాజ్యసభకు పంపాలన్నా బీజేపీ, పీఎంకే మద్దతు అవసరం. అందుకు ఆయా పార్టీలు అంగీకరిస్తాయా అన్నది చూడాలి. అయితే అన్నాడీఎంకే తమతో పొత్తుకు అంగీకరిస్తే అందుకు బీజేపీ నుంచి సానుకూలత వ్యక్తమయ్యే అవకాశముంది. అంటే ఎటు నుంచి ఎటు చూసినా ఈసారి జరిగే రాజ్యసభ ఎన్నికలు కొత్త పొత్తులకు నాందీ కాబోతున్నాయన్నది సుస్పష్టం.

కమల్‌కు అవకాశం ఖాయం...

గత పార్లమెంటు ఎన్నికల్లో తమకు మద్దతు పలికినందుకు కమల్‌ను రాజ్యసభకు పంపిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇచ్చారు. అయితే స్టాలిన్ ఇచ్చిన హామీ మేరకు కమల్‌ను రాజ్యసభకు పంపిస్తారని, అక్కడ కూడా తమ పార్టీ తరఫున గట్టిగా మాట్లాడేందుకు, మతవాద శక్తులను ఎండగట్టేందుకు కమల్ అవసరం ఎంతోవుందని డీఎంకేకు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. దీనికి తోడు డీఎంకే సీనియర్ నేత, దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం రాత్రి కమల్‌తో భేటీ అయ్యారు. రాజ్యసభ ఎన్నిక గురించే ఈ ఇద్దరు నేతల మధ్య చర్చ నడిచినట్లు సమాచారం. ఎన్నికకు సిద్ధంగా వుండాలని శేఖర్‌బాబు చెప్పినట్లు తెలిసింది. మరి నాలుగు స్థానాల్లో ఒకటి కమల్‌కు, మరొకటి ఎండీఎంకే అధినేత వైగోకు వెళ్తే, మిగిలిన రెండు స్థానాల్లో విల్సన్, ఎంఎం అబ్దుల్లాను కొనసాగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది. సీనియర్ న్యాయవాది పి.విల్సన్ డీఎంకేకు అన్ని విధాలా అండగా వున్నారు. సీఎం స్టాలిన్ కూడా ఆయన పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నందున ఆయన్ని మళ్లీ కొనసాగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే అబ్దుల్లాను మాత్రం ఈసారి అసెంబ్లీకి పంపాలనే ఆలోచనలో ఉన్న స్టాలిన్ కొత్తవారికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది.

అన్నాడీఎంకేలో అసమ్మతి సెగలు!


● ఈపీఎస్‌పై సెంగోట్టయ్యన్ అలక ● ఆయన ఇంటికి పోలీసు భద్రత

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకేలో అసమ్మతి సెగలు రేగుతున్నాయి. మాజీ మంత్రి గోకుల ఇందిర తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ ఇప్పటికే పార్టీ అధిష్ఠానంపై అసంతృప్తి వ్యక్తం చేయగా, ఇప్పుడు మరో మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ అదే బాట పట్టారు. వీరిద్దరూ గతంలో ఓపీఎస్ అనుచరులు కావడం గమనార్హం. పార్టీ దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత ఫొటోల కంటే పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఫొటోలే పెద్దవి పెడుతున్నారని, ఎన్నో త్యాగాలు చేసి, పార్టీని ఉన్నత స్థితికి చేర్చిన దివంగత నేతలను విస్మరించడం భావ్యమేనా అంటూ సీనియర్ నాయకుడు సెంగోట్టయ్యన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈపీఎస్‌పై అసంతృప్తితో వున్న నేతలు మరికొంత మంది కూడా బయటకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మాజీముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత అన్నాడీఎంకేలో మొదలైన అసమ్మతి కొనసాగుతూనే వుంది. పార్టీ నుండి బహిష్కృతులైన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, జయలలిత సన్నిహితురాలు శశికళను తిరిగి పార్టీలో చేర్చుకోవాలంటూ బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకూ పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు ఆ ఇద్దరిని పార్టీలో చేర్చుకోవాలంటూ ఈపీఎస్‌పై ఒత్తిడి చేస్తునే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి సెంగోట్టయ్యన్ ఆ బహిష్కృత నేతలకు వత్తాసు పలకటం పార్టీలో తీవ్ర కలకలం సృష్టించింది. సెంగోట్టయ్యన్‌కు కుడిభుజంగా వ్యవహరిస్తున్న ఆరుగురు నాయకులు కూడా పార్టీ నుండి దూరమైనవారిని మళ్ళీ పార్టీలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అందరూ ఏకమైతేనే అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించగలదని వారు బహిరంగంగానే ప్రకటనలు చేస్తుండడం గమనార్హం. గత ఆదివారం కోవై సమీపంలో అత్తికడవు అవినాశి పథకం అమలుకోసం కృషి చేసిన ఈపీఎస్ సత్కారసభ జరిగింది. అదే ప్రాంతానికి చెందిన సెంగోట్టయ్యన్ ఆ సభకు కాలేదు. దీనిపై సెంగోట్టయ్యన్ వివరణ ఇస్తూ.. ఆ సభలో పార్టీ దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత ఫొటోలు లేకపోవడం వల్లే తాను హాజరుకాలేదన్నారు. ఈపీఎస్ సత్కారసభ పార్టీ ఆధ్వర్యంలో జరగలేదని, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరగటంతో వేదికపై ఏయే నేతల ఫొటోలు ఉండాలో పార్టీ ఎలా చెబుతుందని పార్టీ సీనియర్ నాయకుడు జయకుమార్ ప్రశ్నించారు. కాగా సోమవారం ఢిల్లీలోని పార్టీ నూతన కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలోనూ సెంగోట్టయ్యన్ పాల్గొనలేదు. ఈ విషయమై ఆయన అనుచరులను ప్రశ్నించగా ఆహ్వానపత్రిక అందకపోవడం వల్లే ఆయన హాజరుకాలేదని చెప్పారు. వీటన్నింటికంటే సెంగోట్టయ్యన్ సొంత జిల్లా అయిన ఈరోడ్‌లో కార్యదర్శుల నియామకంలో కూడా ఆయన సూచనలేవీ ఈపీఎస్ పరిగణనలోకి తీసుకోకపోవడం కూడా సెంగోట్టయ్యన్ అసంతృప్తికి ఒక కారణమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈపీఎస్ వద్దకు సెంగోట్టయ్యన్‌ను తీసుకొచ్చేందుకు ఆయన సన్నిహితులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ వ్యవహారం ఎటు నుంచి ఎటువైపు దారి తీస్తుందని పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

సెంగోట్టయ్యన్ ఇంటికి సాయుధ బలగాలతో భద్రత

ఈపీఎస్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన రెండురోజుల్లోనే గోపిచెట్టిపాళయం సమీపంలోని కుళ్లంపాళయం తోటలో వున్న సెంగోట్టయ్యన్ నివాసానికి ప్రభుత్వం హఠాత్తుగా సాయుధ బలగాలతో భద్రత కల్పించింది. ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతో రేయింబవళ్లు భద్రత కల్పిస్తోంది. దీని గురించి పోలీసులు మాట్లాడుతూ.. తన ఇంటికి భద్రత కల్పించాలని ఎమ్మెల్యే సెంగోట్టయ్యన్ గతంలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని, ఆ మేరకు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.

నేనెవ్వరినీ కలవలేదు : సెంగోట్టయ్యన్



సెంగోట్టయ్యన్ ఇతర పార్టీల వైపు చూస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. బుధవారం ఉదయం తన నివాసం వద్ద మాట్లాడుతూ.. వందలాదిమంది కార్యకర్తలు వివిధ పనులపై వచ్చివెళ్తుంటారని, అంతేతప్ప తాను ప్రత్యేకంగా ఏ నేతతోనూ భేటీ కాలేదని వివరించారు. అంధియూరులో జరగనున్న మాజీ సీఎం ఎంజీఆర్ జయంతికి ఆహ్వానించేందుకే కొంతమంది నేతలు వచ్చారని వివరించారు.

సమాచార దర్శిని

19న 'ఛాట్ జీపీటీ'పై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'ఛాట్ జీపీటీ'పై ఈ నెల 19న శిక్షణ ఇవ్వనున్నారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమల యజమానులు, స్టార్టప్ సంస్థలు ఛాట్ జీపీటీ ద్వారా వ్యాపార లావాదేవీలు, సులభతరమైన వ్యాపారం, ఖర్చుల తగ్గింపు సహా పలు విషయాలపై వివరించనున్నారు. నగరంలో తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణా కేంద్రంలో 19వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటలకు వరకు శిక్షణ జరుగనుంది. మరిన్ని వివరాలకు www.editn.inఅనే వెబ్‌సైట్, 9080609808, 9841693060 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

నేడు తాంబరం కార్పొరేషన్‌లో గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తాంబరం కార్పొరేషన్ పరిధిలో బుధవారం ఉదయం గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... 2వ మండలం పరిధిలో క్రోంపేట ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటలు (9,13-21,24,26-28 వార్డులు), 4వ మండలం పరిధిలో వెస్ట్ తాంబరం అంబేడ్కర్ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటలు (32,33,49-61 వార్డులు) జరుగనున్న గ్రీవెన్స్, ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఈ నెల 14వ తేది నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది.ఆ ప్రకారం కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం తదితర ప్రాంతాలకు ఈ నెల 14వ తేది 245 బస్సులు, 15వతేది 240 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 14, 15 తేదీల్లో తలా 51 ప్రత్యేక బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుండి 14,15 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

రూ.14 కోట్లతో తిరువొత్తియూర్‌లో బస్ టెర్మినల్

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ మెట్రో రైల్వేస్టేషన్ సమీపంలో రూ.14 కోట్లతో డిపో, బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తెలిపింది. తిరువొత్తియూర్‌లో మెట్రో పనుల కారణంగా, మాణిక్కం నగర్ మెయిన్‌లో రోడ్డు ఉన్న బస్టాండ్, డిపోను అజాక్స్ నగర్‌కు మార్చారు. ప్రస్తుతం ఈ బస్టాండ్ నుంచి బ్రాడ్‌వే, తాంబరం, కిలంబాక్కం, కోయంబేడు సహా పలు ప్రాంతాలకు 80కి పైగా బస్సులు నడుపుతున్నారు. అలాగే, ఈ బస్టాండ్ నుంచి సబర్బన్, మెట్రో రైల్వేస్టేషన్లకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో, తిరువొత్తియూర్ మెట్రోరైలు నిర్వాహకులు, మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ సంయుక్తంగా కొత్త బస్ టెర్మినల్, డిపో నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించాయి. సంస్థను ఎంపిక 12 నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

ఒకే రోజు రూ.237 కోట్ల 'రిజిస్ట్రేషన్' ఆదాయం

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్త రోజైన సోమవారం ఒకే రోజు రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖకు రూ.237.98 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రజల కోరిక మేరకు శుభదినమైన ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం రోజు వేకువజాము నుంచే రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. అలాగే, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయంలో ఒక రోజు వంద నుంచి 150 పత్రాలు, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లున్న కార్యాలయాల్లో 200 నుంచి 300 చొప్పున రిజిస్ట్రేషన్ చేసేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 5వ తేదీ ఒకే రోజు రూ.238.15 కోట్ల ఆదాయం వచ్చింది. ఇపుడు రెండోసారి రూ.237.98 కోట్ల ఆదాయం సమకూరింది. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక రోజు ఆదాయం రెండో సారి రూ.237 కోట్లు దాటిందని పేర్కొంది.

15 ప్రాంతాల్లో స్వల్పంగా తగ్గిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 15 ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు స్వల్పంగా తగ్గాయని మెట్రోవాటర్ బోర్డు తెలిపింది. ఆ ప్రకారం, మాధవరంలో అధికంగా 1.37 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అలాగే, కోడంబాక్కంలో 1.1 మీ, అంబత్తూర్, తేనాంపేట ప్రాంతాల్లో 0.88 మీ, తిరువొత్తియూర్, రాయపురం ప్రాంతాల్లో వరుసగా 0.22 మీ, 0.29 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అదే సమయంలో 2024 జనవరితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో భూగర్భ జలమట్టాల తగ్గుదల 0.3 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు.

● పొగమంచు ఎఫెక్ట్...

విమాన సేవలకు అంతరాయం

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో గత వారం పది రోజులుగా దట్టంగా మంచు కురుస్తుంది. తెల్లవారుజామున పొగమంచు, పగటి పూట సూర్యతాపం అధికంగా ఉంది. ఈ కారణంగా విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అనేక విమాన సర్వీసులు ఆలస్యంగా రావడంతో, గంటల కొద్దీ ఆలస్యంగా బయలుదేరి వెళుతున్నాయి. బుధవారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఏకంగా 14 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. చెన్నై నుంచి బయలుదేరాల్సిన సింగపూర్, దుబాయ్, బహ్రెయిన్, అబుదాబి, మస్కట్, కోల్‌కతా, సూరత్, విజయవాడ, భువనేశ్వర్, అండమాన్ విమాన సర్వీసులు ఆలస్యంగా బయలుదేరాయి. అలాగే, మస్కట్, కౌలాంటూర్, దుబాయ్, సింగపూర్ నుంచి చెన్నైకు రావాల్సిన నాలుగు విమాన సర్వీసులు ఆలస్యంగా వచ్చాయి. దీంతో విమాన ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

మీనాక్షి ఆలయంలో రాత్రంతా భక్తులకు అనుమతి

ప్యారీస్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఆ ప్రకారం, ఈ నెల 26 రాత్రి నుంచి 27వ తేది తెల్లవారుజాము వరకు స్వామి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

సెంథిల్ బాలాజి మంత్రిగా కొనసాగడం అవసరమా?





● ఆయన కేసులో 200 మంది సాక్షులు ● ప్రశ్నించిన సుప్రీంకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సెంథిల్ బాలాజీ మంత్రిగా కొనసాగాలా అనే విషయమై అఫిడవిట్ దాఖలుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. చట్టవ్యతిరేకంగా నగదు బట్వాడా కేసులో ఈడీ అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజి, 417 రోజుల అనంతరం బెయిలుపై విడుదలయ్యారు. విడుదలై మరుసటిరోజే ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా సెంథిల్ బాలాజి బాధ్యతలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ చెన్నైకి చెందిన విద్యాకుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. మంత్రి పదవిలో లేననే కారణంతో బెయిలు పొందిన ఆయన, మరుసటిరోజే మంత్రిగా బాధ్యతలు చేపట్టారని, దిగువ కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో, విచారణకు అడ్డంకులు సృష్టించే అవకాశముందని, అందువల్ల ఆయన బెయిలు రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గతంలో విచారించిన న్యాయమూర్తులు, సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ప్రశ్నలు వేశారు. ఈ క్రమంలో, ఈ పిటిషన్ బుధవారం మళ్లీ విచారణకు రాగా... సెంథిల్ బాలాజీకి బెయిలు రాక ముందు ఈ కేసులో విచారణ జరిపిన ఫోరెన్సిక్ నిపుణుడు ఇప్పుడు గైర్హాజరయ్యారని, ప్రస్తుతం ఆయన మంత్రిగా ఉండడంతో నిపుణుడు భయంతో విచారణకు హాజరుకాలేదని, అందువల్ల సెంథిల్ బాలాజీ బెయిలు రద్దు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం న్యాయవాది వాదించారు. సెంథిల్ బాలాజి మంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు అంత అవసరం ఎందుకని న్యాయమూర్తులు ప్రశ్నించారు. 200 మంది ప్రభుత్వ ఉద్యోగులు సాక్ష్యులుగా ఉన్న నేపథ్యంలో, ఆయన మంత్రిగా ఉంటే ఏం జరుగుతుంది? సెంథిల్ బాలాజి మంత్రిగా కొనసాగాలా? అనే విషయం ఆయన తరఫు వివరణ చెప్పండి. అలా ఆయన మంత్రిగా కొనసాగే పక్షంలో, ప్రాధాన్యత ఆధారంగా విచారణ జరిపించవచ్చంటూ, తదుపరి విచారణ మార్చి 4వ తేదీకి వాయిదావేశారు.

రైలు పట్టాలపై ఇనుప రాడ్డు పెట్టిన విద్యార్థి గుర్తింపు

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూరు - వింకో నగర్ ప్రాంతాల మధ్య రైలు పట్టాలపై ఇనుప రాడ్లు పెట్టిన విద్యార్థిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆ విద్యార్థికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య ఉన్న రైలు పట్టాలపై గత వారం పెద్ద ఇనుప రాడ్డును గమనించిన రైల్వే సిబ్బంది దాన్ని తొలగించంతో పెను ప్రమాదం తప్పింది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, ఓ బాలుడుని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత విద్యార్థికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలివేశారు.

తిరుత్తణి వెళ్లే భక్తులకు ఉచిత బస్సు

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు రామ్మూర్తి విరాళం



తిరుత్తణి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి మురుగన్ ఆలయానికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, వ్యాపారవేత్త రామ్మూర్తి బస్సు విరాళంగా అందజేశారు. కొండపైకి వెళ్లే భక్తుల కోసం రూ.20లక్షల విలువైన బస్సును ఆలయానికి విరాళంగా అందించగా, బుధవారం ఉదయం ఆలయ అర్చకులతో బస్సుకు పూజలు నిర్వహించిన అనంతరం రామ్మూర్తి జెండా ఊపి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈబస్సులో 35మంది భక్తులు సౌకర్యవంతంగా కూర్చొని ఆలయానికి చేరుకునేలా తన వంతుగా దేవస్థానానికి ఉచితంగా బహూకరించానని రామ్మూర్తి తెలిపారు.

17న ఓపీఎస్ మద్దతుదారుల సమావేశం

వేళచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మద్దతుదారుల సమావేశం ఈ నెల 17వ తేది జరుగనుంది. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారంపై ఎన్నికల సంఘం విచారణకు అనుమతిస్తూ బుధవారం మద్రాసు హైకోర్టు ఆదేశించింది. వాటిపై పన్నీర్‌సెల్వం మద్దతుదారుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, కోర్టు ఉత్తర్వులతో తదుపరి జరిగే పరిణామాలపై చర్చించేందుకు ఈ నెల 17న నగరంలో సమావేశం నిర్వహించనున్నట్లు, పార్టీ నేతలు తప్పక పాల్గొనాలని పన్నీర్‌సెల్వం ప్రకటన విడుదల చేశారు.

కోర్టుకు హాజరైన మాజీ మంత్రి వీరమణి

ప్యారీస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫిర్యాదుకు సంబంధించి కేసులో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి కేసీ వీరమణి తిరుపత్తూర్ కోర్టుకు హాజరయ్యారు. 2021 ఎన్నికల్లో కేసీ వీరమణి ప్రమాణ పత్రంలో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ రామమూర్తి అనే వ్యక్తి కేసు దాఖలుచేశారు. ఈ కేసు విచారణ తిరుపత్తూర్ కోర్టులో జరుగుతుండగా, బుధవారం జరిగిన విచారణకు వీరమణి హాజరయ్యారు.

కిలంబాక్కం బస్ టెర్మినల్‌లో ఆటో డ్రైవర్లకు కొత్త నిబంధనలు

ప్యారీస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కిలంబాక్కం బస్ టెర్మినల్‌లో ఆటో డ్రైవర్లకు తాంబరం పోలీసు కమిషనర్ కొత్త నిబంధనలు విధించారు. ఈ బస్టాండ్‌లో ఇటీవల ఓ యువతిని కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ బస్ టెర్మినల్‌లో ఆటో డ్రైవర్ల కొత్త నిబంధనలు విధించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా పోలీసు శాఖ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి, పోలీసు శాఖలో నమోదుచేసిన ఆటోలు మాత్రమే బస్ టెర్మినల్ ప్రాంగణంలో ఉంచాలి, బయట ప్రాంత ఆటోలు బస్ టెర్మినల్‌లో ప్రయాణికులను దించేందుకు మాత్రమే అనుమతించాలి, ఆటో నెంబరు గుర్తించేలా ఆటోల్లో సక్రమంగా నమోదుచేయాలి తదితర నిబంధనలు విధించగా, ప్రయాణికులు కూడా ఆటో ఎక్కే సమయంలో ఆటో డ్రైవర్ గుర్తింపు కార్డు పరిశీలించాలని తాంబరం పోలీసు శాఖ తెలియజేసింది.

18న అన్నాడీఎంకే విద్యార్థి విభాగం ధర్నా

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై జరుగుతున్న లైంగిక వేధింపులను అడ్డుకోవడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఈ నెల 18వ తేది అన్నాడీఎంకే విద్యార్థి విభాగం ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. వళ్లువర్‌కోట్టంలో నిర్వహించనున్న ధర్నాలో విద్యార్థి విభాగం నేతలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నావల్‌బేస్‌లో సైనికుడి ఆత్మహత్య

ప్యారీస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అరక్కోణంలోని భారత నావికాదళం మైదానంలో ఓ సైనికుడు తుపాకితో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరక్కోణంలోని శిక్షణా కేంద్రంలో పలు రాష్ట్రాలకు చెందిన సైనికులు శిక్షణ పొందుతుంటారు. ఈ నేపథ్యంలో, ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తన గదిలో తుపాకితో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలల్లో లైంగిక వేధింపులా...?

● ఫిర్యాదుకు ప్రత్యేక నెంబరు



పెరంబూర్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులపై విద్యార్థినులు ఫిర్యాదు చేసేలా ప్రత్యేక నెంబరు పరిచయం చేశారు. రాష్ట్రంలో లైంగిక వేధింపులు ఎక్కువవుతున్నాయి. ఇటీవల వేలూరు సమీపంలో రైలులో గర్భిణిపై అత్యాచార యత్నం, ఆమెను రైలు నుంచి తోసివేయడం, ఈరోడ్ సమీపం కొడైకెనాల్ రోడ్డు సమీపంలో రైలులో ప్రయాణిస్తున్న మహిళపై అత్యాచార యత్నం, కృష్ణగిరి, తిరుచ్చి, తిరుప్పూర్ జిల్లాల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ వ్యవహారంపై అన్నాడీఎంకే, బీజేపీ సహా పలు పార్టీలు అధికార డీఎంకే ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి.ఈక్రమంలో పాఠశాలల్లో తమపై జరిగే లైంగికవేధింపులను బాధిత విద్యార్థులు '14417' అనే టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదుచేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెంబరు విద్యార్థులకు తెలియజేసేలా ప్రచారం చేపట్టాలని విద్యాశాఖ సూచించింది.

తిరుప్పరంగుండ్రం సమస్యలకు చెన్నైలో ప్రదర్శనా...?

ప్యారీస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంగుండ్రం సమస్యకు చెన్నైలో ప్రదర్శన చేపట్టడం అవసరమైన సమస్యలు సృష్టిస్తుందని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఏకాంబరేశ్వరాలయం నుంచి కందకోట వరకు వేలాయుధం యాత్ర చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ హిందూ మున్నని సంస్థ నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. తిరుప్పరంగుండ్రం కొండ హక్కుల ప్రశ్న ప్రివ్యూ కమిషన్ వరకు వెళ్లి సమిసిపోయిన నేపథ్యంలో, మళ్లీ ఆ సమస్యను తీసుకురావడం సరికాదని ప్రభుత్వ చీఫ్ క్రిమినల్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దర్గా తరఫున జంతు బలులకు సంబంధించి ఆహ్వానం పలుకుతున్నట్లు నకిలీ పోస్టర్లు ముద్రిస్తున్నారని, ఈ విషయంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. తిరుప్పరంగుండ్రం కొండ కారణంగా చూపి, ప్రజల్లో సమైక్యత దెబ్బతీయరాదని, యాత్రకు పిటిషనర్ కోరిన మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని పోలీసు శాఖ తరఫున హాజరైన న్యాయవాది తెలిపారు. యాత్రకు అనుమతులిస్తే, అనవసర సమస్యలకు దారితీసే అవకాశముందని తెలిపారు. అన్ని వాదనల విన్న అనంతరం యాత్ర జరిపే మార్గం రద్దీ ప్రాంతం. తిరుప్పరంగుండ్రం సమస్యకు, ఈ ప్రాంతానికి ఏం సంబంధం ఉంది? అనవసర సమస్యలు సృష్టించేందుకు యత్నిస్తున్నారు అని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అలాగే, మరో మార్గం సూచించాలని పిటిషనర్‌కు సూచించిన న్యాయమూర్తి, తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదావేశారు.

తిరుత్తణిలో ఫోర్‌లేన్ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్ చంద్రన్, పార్టీ నేతలు

తిరుత్తణి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. గత కొనేళ్లుగా తరుత్తణి - చిత్తూరు మార్గంలో ట్రాఫిక్ జామ్‌వల్ల వాహనాలకు, కొండపైకి వెళ్లే భక్తులకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనిని నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.26కోట్లతో తిరుత్తణి నుండి చిత్తూరు వెళ్లే మార్గాన్ని నాలుగు లేన్లుగా విస్తరించి నిర్మాణాన్ని చేపట్టింది. ఈ నిర్మాణం పనులను తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ బుధవారం ఉదయం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమయంలో హైవే డివిజనల్ ఇంజనీర్ చిత్రరసు, సబ్ డివిజన్ ఏఈ రఘురామన్, ఏఈ జ్ఞాన అరుల్‌రాజ్, డీఎంకే మండల కార్యదర్శి రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే ధ్యానంపై అవగాహన పెంచుకోవాలి

తిరుత్తణి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుండే ధ్యానంపై అవగాహన పెంచుకోవాలని యోగా టీచర్ శ్రీదేవి విద్యార్థులకు సూచించారు. తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టులో సామంతవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శివబాల యోగీశ్వర పిరమిడ్ ధ్యాన మందిర్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ధ్యానంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ధ్యాన మాస్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ధ్యానంతో ఒత్తిడి, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు.కార్యక్రమంలో మాస్టర్ కుమార్, సంస్థ సభ్యులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నా ప్రేమను హేళన చేయడంతో హత్య చేశా

● నిందితుడి వాంగ్మూలం

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమకు అడ్డుచెప్పడం వల్లే ప్రియురాలి తల్లి మైథిలి (60)ని హత్య చేసినట్టు నిందితుడు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. గత సోమవారం ఈస్ట్ ముగప్పేరులోని అపార్టుమెంట్‌లో మైథిలి అనే వృద్ధురాలు హత్యకు గురైంది. దీనిపె జేజే నగర్ పోలీసులు కేసు నమోదు చేసి శ్యామ్ అనే యువకుడిని అరెస్టు చేశారు. ఆ తర్వాత అతడిని విచారించగా పలు విషయాలు వెల్లడించాడు. మైథిలి కుమార్తె రిత్వికతో కొంతకాలంగా ప్రేమేలో ఉన్నా. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రిత్వికను ఇంటివద్ద వదిలిపెట్టగా, ఆమె తల్లి చూసి, మందలించింది. ఈ విషయాన్ని రిత్విక తనకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వెళ్లాను. ఆ సమయంలో రిత్వికను తల్లి మందలిస్తుండటాన్ని చూసి తట్టుకోలేకపోయాను. మేమిద్దరం పెళ్లి చేసుకోబోతున్నామని, రిత్వికను తిట్టొదని కోరాను. కానీ, మైథిలి వినిపించుకోకుండా, ప్రేమను ఒప్పుకోనంటూ హేళనగా మాట్లాడింది. దీంతో ఆగ్రహంతో ఆమె గొంతు గట్టిగా పట్టుకోవడంతో ఊపిరాడక చనిపోయింది అంటూ పోలీసులకు తెలిపాడు.

కారులో తరలిస్తున్న 250 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం నుంచి శ్రీలంక పంపేందుకు కారులో తరలిస్తున్న 250 కిలోల గంజాయిని మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంకకు సముద్ర మార్గం గుండా తరలించేందుకు తెలంగాణా రాష్ట్రం నుంచి రామేశ్వరానికి కారులో గంజాయి తీసుకొస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంలో అధికారులు, పోలీసులు రామనాథపురం జాతీయ రహదారి సమీపంలోని రామ్‌నగర్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కారులో వచ్చిన వ్యక్తులు పోలీసులను గమనించి కారును రోడ్డు పక్కగా ఆపి పరారయ్యారు. పోలీసులు కారులో గాలించి 250 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, పరారైన వారి కోసం గాలిస్తున్నారు.

పచ్చ బఠానీ దిగుమతిలో అవినీతి

● ఐదుగురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మైసూరు పప్పు అని చెప్పి అక్రమంగా పచ్చ బఠానీ దిగుమతి చేసిన వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొల్‌కతా హార్బర్‌కు మాత్రమే పచ్చ బఠానీ దిగుమతులకు అనుమతులున్నాయి. అయినా, మైసూరు పప్పు అని చెప్పి రూ.2 కోట్ల విలువైన పచ్చ బఠానీ నకిలీ దస్తావేజులతో దిగుమతి చేసుకొని అవినీతికి పాల్పడ్డారని రెవెన్యూ ఇంటెలిజెన్స్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ వ్యవహారంలో ముగ్గురు కస్టమ్స్ అధికారులు, ఢిల్లీకి చెందిన ఎగుమతి, దిగుమతిదారులైన ఇద్దరు మొత్తం ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

తాళితో పాఠశాలకు వచ్చిన విద్యార్థిని !

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని పాఠశాలకు తాళితో రావడంతో సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి చెందారు. పోలీసుల కథనం మేరకు... సదరు విద్యార్థినికి, కావేరిపట్టణానికి చెందిన 25 ఏళ్ల యువకుడికి ఇరుతరఫు కుటుంబాలు కుందారపల్లి సమీపంలోని మురుగన్ ఆలయంలో వివాహం జరిపించారు. తమ ఇంట్లో జరిగే శుభకార్యం కోసం కొత్త బట్టలు కొనేందుకు వెళ్తున్నామని చెప్పిన విద్యార్థిని పాఠశాలకు రాలేదు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం విద్యార్థిని యధావిధిగా పాఠశాలకు రాగా, ఆమె మెడలో మంగళసూత్రం గమనించిన సహచర విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమాచారంతో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాఠశాలకు చేరుకొని ఆమెను విచారించడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఈ ఘటనపై అధికారుల ఫిర్యాదుతో కృష్ణగిరి మహిళా పోలీసులు విచారించి యువకుడు, అతని తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు సహా ఐదుగురిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రైలు ఢీకొని ఇద్దరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు-పెరుంగళత్తూర్ మధ్య రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ రెండు స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కనే రెండు మృతదేహాలున్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారణలో... మృతులు కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ ప్రాంతానికి చెందిన విక్రమ్ (21), చిదంబరం ప్రాంతానికి చెందిన ఆదిలక్ష్మి (22) అని తెలిసింది. ఇద్దరూ వండలూరులో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నట్లు, మంగళవారం రాత్రి సబర్బన్ రైలు ఢీకొనడంతో మృతిచెందారని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అనుమానాస్పద మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఉళుందూర్‌పేట అజీస్ నగర్ ప్రాంతానికి చెందిన ముత్తు, నైవేలీలో పనిచేస్తున్నాడు. ముత్తు కుటుంబంతో ఎన్ఎల్‌సీ క్వార్టర్స్‌లో నివసిస్తున్నాడు. ఆయన మంగళవారం సాయంత్రం తన స్వగ్రామం ఉళుందూర్‌పేట సమీపం అజీస్ నగర్ రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టిన సమయంలో, పక్కనే ఉన్న చెరువులో ముత్తు భార్య దేవి, కుమారుడు ప్రవీణ్ మృతదేహాలను గుర్తించారు. వాటిని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, భార్య, కుమారుడిని హతమార్చి ముత్తుకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా? వీరి మరణాలకు కారణాలేంటి? అనే అంశాలపై విచారణ చేపట్టారు.

విరుదునగర్ సమీపంలో ఇసుక దోపిడీ

● తహసీల్దార్ సహా ఏడుగురి సస్పెన్షన్

వేళచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో ఇసుక దోపిడీ వ్యవహారంలో జిల్లా కలెక్టర్ జయశీలన్ ఏడుగురు అధికారులను సస్పెండ్ చేశారు. విరుదునగర్ జిల్లా తిరుచ్చుళి, సాత్తూర్ పరిసర ప్రాంతాల్లోని వాగుల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులందాయి. వాటిపై సత్వరం స్పందించకపోవడం, ఇసుక దోపిడీని అరికట్టకపోవడం తదితర కారణాలతో సాత్తూర్ తహసీల్దార్ సహా ఏడుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

సేలం సమీపంలో బస్సు బోల్తా

● సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపిన డ్రైవర్ సస్పెన్షన్



బోల్తా పడిన బస్సు

వేళచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. సేలం జిల్లా ఆతూర్ నుంచి పరిసర గ్రామాలకు బస్సులు నడుస్తున్నాయి. ఆ ప్రకారం, ఆతూర్ నుంచి వానగరానికి ప్రతిరోజు బస్సు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం వానగరం వెళ్తున్న బస్సు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఏడుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను రక్షించి ఆతూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అధికారులు చేపట్టిన విచారణలో, డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపినందువల్లే ప్రమాదం జరిగిందని నివేదిక నేపథ్యంలో రవాణా శాఖ సేలం జిల్లా అధికారి డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు.

తిరుపతి వెళ్లే బస్సులో మంటలు

● భయంతో వణికిన ప్రయాణికులు

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు బస్టాండు నుంచి తిరుపతికి మంగళవారం రాత్రి 11 గంటలకు బయలుదేరిన ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన ఏసీ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఈ బస్సు పూందమల్లి సమీపంలో వెళ్తుండగా, ఒక్కసారిగా బస్సు నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. డ్రైవర్ అప్రమత్తమై బస్సు ఆపేసి ప్రయాణికులందరినీ కిందకు దించేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ తర్వాత ఈ ప్రయాణికులందరినీ మరో బస్సులో తిరుపతికి పంపించారు. కాగా, ఈ ప్రమాదంపై పూందమల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థికి లైంగిక వేధింపులు

● ఉపాధ్యాయుడి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్ నగర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి(బాలుడు)ని లైంగికంగా వేధించిన కేసులో ఓ ఉపాధ్యాయుడుని నగర పోలీసులు అరెస్టు చేశారు. అశోక్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు స్కూల్‌లో తమిళ టీచరుగా పనిచేస్తున్నాడు. ఈయన తన వద్ద చదువుకునే 14 యేళ్ళ విద్యార్థి హోం వర్క్ ఎందుకు చేయలేదని అడుగుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఆ బాలుడు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్ళడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. సుధాకర్‌ను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

పెట్రోల్ బాంబుతో చిక్కిన యువకుడు

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా కేంద్రంలోని చెల్లాపురంలో మంగళవారం అర్థరాత్రి 12.30 గంటల సమయంలో పెట్రోల్ బాంబులతో ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు సుందరాపురానికి చెందిన నాజర్‌గా గుర్తించారు. ఈయన గతంలో బీజేపీ నాయకుడు మణికంఠన్ వద్ద కొన్ని నెలల పాటు పనిచేశాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం మణికంఠన్‌ను రూ.5 వేలు నగదు అడగ్గా ఆయన నిరాకరించాడు. దీంతో మణికంఠన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని నాజర్ నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి తన స్నేహితులతో కలిసి మద్యం సేవించిన నాజర్... రెండు పెట్రోల్ బాంబులు తీసుకుని బీజేపీ కార్యాలయంలో వేసేందుకు వెళ్తూ చిక్కాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ధనుష్.. ఓ గొప్ప కళాకారుడు

● దర్శకుడు రాజ్‌కుమార్



ఆడియో రిలీజ్ దృశ్యం

హీరో ధనుష్ ఒక గొప్ప కళాకారుడని 'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి కొనియాడారు. ఒక చిత్రంలో నటిస్తూ, మరో చిత్రానికి దర్శకుడుగా ఏకకాలంలో ఎలా పనిచేస్తున్నారంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ధనుష్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందిన 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్' ఈ నెల 21న విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని తాజాగా ఆ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులో నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య, దర్శకులు రాజ్‌కుమార్ పెరియస్వామి, కస్తూరి రాజా, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సహా చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 'ధనుష్ ఒక గొప్ప కళాకారుడు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం మరింత బలాన్ని చేకూర్చుతుందంటూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌జే సూర్య మాట్లాడుతూ, 'చిత్రపరిశ్రమంలో నటీనటుల కొరత ఉంది. హీరో ధనుష్ దర్శకుడిగా ఒక బృందాన్నే తయారు చేశారు. ఒకే సమయంలో రెండు వేర్వేరు కథాంశాలతో కూడిన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడిగా, హాలీవుడ్‌కు వరకు వెళ్లిన గొప్ప నటుడిగా ఖ్యాతిగడించారన్నారు. జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'యూత్‌ఫుల్ మూవీ కావడంతో అందుకనుగుణంగా సంగీతం కంపోజ్ చేసాను. ధనుష్‌తో కలిసి పని చేయడం, ముఖ్యంగా ధనుష్ దర్శకత్వంలో తొలిసారి సంగీతం సమకూర్చడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. కాగా, ఈ చిత్రంలో భవిష్ నారాయణన్, అనికా సురేంద్రన్, మేథ్యూ థామస్, ప్రియా ప్రకాష్ వారియర్, వెంకటేష్ మేనన్, రమ్య రంగనాథన్, శరణ్య పొన్‌వణ్ణన్, శ్రీదేవి తదితరులు నటించారు. వుండర్‌బార్ ఫిలిమ్స్ పతాకంపై కస్తూరి రాజా, విజయలక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మించారు.

హాట్ ఫొటోలకూ నో చెప్పలేదు

● చాందిని తమిళరసన్



తాను ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేసిన హాట్ ఫొటోలను చూసిన తర్వాత కూడా తన భర్త ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని హీరోయిన్ చాందిని తమిళరసన్ అన్నారు. ఇపుడు తాను వివాహ జీవితాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నట్టు వివరించారు. ఆమె నటించిన తాజా చిత్రం 'ఫైర్'. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తన వైవాహిక జీవితం గురించి స్పందించారు. 'నాకు 2018లోనే వివాహమైంది. అంటే 2016లోనే మా పెళ్ళి విషయం చర్చించారు. వివాహ సమయంలోనే నేను నటించిన పలు చిత్రాలు విడుదలయ్యాయి. ఒక వేళ పెళ్ళికి ముందే నేను నటించిన చిత్రాలు విడుదలైవుంటే సినిమాలో మరో అడుగు ముందుకు వేసేందుకు ఆలోచన చేయాల్సి వచ్చేది. సినీ కెరీర్‌ను మూడుముళ్ళ బంధం దెబ్బతీస్తుందని భయపడ్డాను. అందుకే వివాహాన్ని ఇన్‌సెక్యూర్‌గా ఫీలయ్యాను. అయినప్పటికీ నా మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నాను. నా భర్త నందా కూడా నాకు ఎంతో సపోర్టు చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో హాట్ ఫొటోలను షేర్ చేసినా ఆయన ఎంతో స్పోర్టివ్‌గా తీసుకున్నారు. అయితే, నేను నటించిన చిత్రాలు పెద్దగా విజయం సాధించకపోవడం ఒకింత నిరాశగా ఉంది' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి

'లవ్ మ్యారేజ్' ఫస్ట్‌లుక్ విడుదల

నూతన దర్శకుడు షణ్ముగ ప్రియన్ దర్శకత్వంలో విక్రమ్ ప్రభు నటిస్తున్న 'లవ్ మ్యారేజ్' మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. సుస్మితా భట్ హీరోయిన్. మీనాక్షి దినేష్, రమేష్ తిలక్, అరుల్‌దాస్, గజరాజ్, మురుగానందం, కోడంగి వడివేలు తదితరులు ఇతర పాత్రలను పోషించారు. షాన్ రోల్డన్ సంగీతం. మదన్ క్రిస్టోఫర్ కెమెరా. అష్యూర్ ఫిలిమ్స్, రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై శ్వేత, శ్రీనిధి సాగర్ నిర్మించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'పల్లెటూరి నేపథ్యంలో సాగే స్క్రీన్‌ప్లేతో అందరి మనసులకు హత్తుకునేలా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీగా చిత్రీకరించాం. వివాహాలు ఆలస్యమైన పురుషుల మధ్య సాగే సంభాషణలను ఫన్నీగా చిత్రీకరించాం. చిత్రీకరణ పూర్తికాగా, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా సాగుతున్నాయి. ఇపుడు ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశాం. ఇందులో హీరోహీరోయిన్ కథ, ఇతర పాత్రల ను చక్కగా డిజైన్ చేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.



రూ.100 కోట్ల హీరోను డైరెక్ట్ చేశా


ప్రదీప్ రంగనాథన్, అర్చన, అశ్వత్ మారిముత్తు

● 'డ్రాగన్' దర్శకుడు అశ్వత్ మారిముత్తు

తాను సినిమాకు దర్శకత్వం వహించలేదని 'లవ్ టుడే' అనే మూవీతో రూ.100 కోట్లు వసూలు చేసిన స్టార్ హీరోను డైరెక్ట్ చేసినట్టు దర్శకుడు అశ్వత్ మారిముత్తు వెల్లడించారు. ఏజీఎస్ పతాకంపై కల్పాతి ఎస్ అఘోరం, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేస్ నిర్మాణ సారధ్యంలో అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'డ్రాగన్'. ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ హీరో హీరోయిన్లుగా నటించగా కేఎస్ రవికుమార్, గౌతం వాసుదేవ్ మేనన్, మిష్కిన్, వీజే సిద్ధు, హర్షద్ ఖాన్, మరియం జార్జ్, ఇందుమతి మణికంఠన్, తేనప్పన్ తదితరులు నటించారు. ఈ నెల 14వ తేదీ విడుదలకానున్న నేపథ్యంలో చిత్ర బృందం మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో దర్శకుడు అశ్వత్ మాట్లాడుతూ, 'తమిళంలో నా రెండో చిత్రం. 'ఓ మై కడవులే' సినిమా తర్వాత తెలుగు సినిమా వర్క్ ఎలా ఉంటుందో తెలుసుకున్నాను. ఇపుడు ఈ చిత్రాన్ని రూపొందించాను. 'ఓ మై కడవులే' మూవీలో సామాజిక బాధ్యత వివరించాను. హీరో ప్రదీప్, నేను పదేళ్ళుగా మంచి స్నేహితులం. ఈ స్టోరీ గురించి పదేళ్ళ క్రితమే చర్చించుకున్నాం. ఆ తర్వాత మేమిద్దరం కన్న కల నేడు సాకారంకానుంది. ప్రదీప్ రంగనాథన్ అనే నా స్నేహితుడిని ఈ సినిమా ద్వారా డైరెక్ట్ చేయలేదు. 'లవ్‌టుడే' అనే మూవీతో రూ.100 కోట్లు వసూలు చేసిన ప్రదీప్ రంగనాథన్ అనే ఒక స్టార్ హీరోను డైరెక్ట్ చేశాను. ఈ మూవీ ఆయనకు అతిపెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. మేమిద్దరం స్నేహితులం అనే సరిహద్దులను దాటి మంచి బిజినెస్ కావాలని తీవ్రంగా శ్రమించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఖచ్చితంగా అలరించే మూవీగా ఉంటుందన్నారు. ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, 'గత నా చిత్రాలను ఆదరించినట్టుగానే ఈ మూవీని కూడా ఆదరించాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు.




ప్రేమికుల దినోత్సవం కోసం..

భారీగా రోజాల దిగుమతి

● సిద్ధమైన బహుమతులు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీగా రోజాలు, రకరకాల అందమైన పుష్పాలు నగరానికి దిగుమతయ్యాయి. ఫిబ్రవరి 14వ తేదీ ప్రేమికుల దినోత్సవాన్ని ప్రేమికులు ఘనంగా చేసుకుంటారనే విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారు అందమైన రోజాలు, పుష్పాలు, అమూల్యమైన బహుమతులను ఇచ్చిపుచ్చుకుంటారు. అందుకే ప్రేమికుల అభిరుచి మేరకు రకరకాల రోజాలు, బహుమతులను వ్యాపారులు తమ దుకాణాల్లో అందుబాటులో వుంచుతారు. ఈ ఏడాది కృష్ణగిరి, నీలగిరి, దిండుగల్ జిల్లా నుంచి భారీగా రోజాలు నగరానికి దిగుమతయ్యాయి. పలు దుకాణాల్లో రకరకాల ఆకృతుల్లో రోజాలు అలరిస్తున్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు కూడా అంతే స్థాయిలో వున్నాయన్న సణుగుడూ వినిపిస్తోంది మరి!




రకరకాల పుష్పాలు, మాలలు, గులాబీలు

జేఈఈలో రాష్ట్ర టాపర్‌గా నారాయణ విద్యార్థి

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-2025 మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు పైచేయి సాధించారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన సన్నీ యాదవ్ తమిళనాడు టాపర్‌గా నిలవడం విశేషం. అదేవిధంగా రాష్ట్రంలో 14 మంది విద్యార్థులు 99 పర్సంటైల్, 30 మంది 98 పర్సంటైల్, 46 మంది విద్యార్థులు 97 పర్సంటైల్, 69 మంది విద్యార్థులు 95 పర్సంటైల్, 118 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించారు. గోపాలపురంలోని నారాయణ విద్యా సంస్థలో సంస్థ డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణి ర్యాంకర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

వైవిధ్యభరితం.. ఆలోచనాత్మకం

● మద్రాస్ వర్సిటీలో ధర్మనిధి ఉపన్యాసాలు

చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన 'ధర్మనిధి ఉపన్యాసాలు' వైవిధ్యభరితంగా, ఆలోచనాత్మకంగా సాగాయి. మెరీనాలోని రజతోత్సవ ప్రాంగణంలో రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉపన్యాసాల ప్రారంభ సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైవిధ్యమైన కార్యక్రమాల్లో భాగంగా ధర్మనిధి ఉపన్యాసాలు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం ఆరు ధర్మనిధి ఉపన్యాసాల్లో, మూడు తమ శాఖ ఆచార్యులవే కావడం విశేషమన్నారు. ఇలాంటి ఉపన్యాసాలు సాధారణ సదస్సుల కంటే విభిన్నమైనవని, ఒక్కో ధర్మనిధి ఉపన్యాసం ఒక్కో అంశంతో వుంటుందన్నారు. ముఖ్య అతిథి ఎల్‌బీ సుజాత, విశిష్ట అతిథి గోపాలుని హైమావతి, ప్రత్యేక అతిథి డాక్టర్ ఏవీ శివకుమారి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో ధర్మనిధి ఉపన్యాసాలు నిర్వహించడం గొప్ప విశేషమని, ఇలాంటి కార్యక్రమాలు ఆచార్య విస్తాలికే సాధ్యమని ప్రశంసించారు. రాజధాని కళాశాల తెలుగు శాఖ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ హెచ్.అనిందిత తెలుగుశాఖ చేసే కార్యక్రమ విశిష్టతలను, ధర్మనిధి ఉపన్యాసాల ఆవశ్యకతను వివరించారు. డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలికిన ఈ కార్యక్రమం డాక్టర్ మాదా శంకరబాబు వందన సమర్పణతో ముగిసింది. అనంతరం మొదటి సమావేశం 'ఆర్కాటు ప్రకాశరావు స్మారక ధర్మనిధి ఉపన్యాసం'లో భాగంగా మద్రాస్ క్రైస్తవ కళాశాల, తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ శ్రీపురం యజ్ఞశేఖర్ 'రాజపాళెం తెలుగు కవులు సాహిత్యం' అనే అంశంపై, రెండో సమావేశం ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ వి.పళని 'తెలుగు సంస్కృత భాషలు-వైరుధ్యం' అనే అంశంపై, మూడవది ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా మద్రాస్ విశ్వవిద్యాలయం కన్నడ శాఖాధ్యక్షులు ఆచార్య తమిళ్‌సెల్వి 'కన్నడ సాహిత్యం-మానవతావాదం' అనే అంశంపై ప్రసంగించారు. కాగా గురువారం మూడు ధర్మనిధి ఉపన్యాసాలతో పాటు ముగింపోత్సవం కూడా వుంటుంది. ఈ సందర్భంగా ఆచార్య విస్తాలి అతిథులను సత్కరించారు.


అతిథులను సత్కరిస్తున్న ఆచార్య విస్తాలి

క్రికెట్ ఆడిన చెన్నై మేయర్



వేళచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డీఎంకే నాయకుల మధ్య జరుగనున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ప్రియ బ్యాటింగ్, బౌలింగ్ శిక్షణకు హాజరయ్యారు. డీఎంకే క్రీడాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో క్రికెట్ పోటీలు జరుగనున్నాయి. యువజన, విద్యార్థి, క్రీడాభివృద్ధి మొత్తం 20 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ జట్లలో జీసీసీ కార్పొరేటర్లు, మేయర్‌తో కూడిన జట్టు కూడా ఉంది. ఇందుకోసం రాజధాని కళాశాల ప్రాంగణంలో జరిగిన శిక్షణలో మేయర్ సహా కార్పొరేటర్లు పాల్గొన్నారు. మేయర్ ప్రియ బ్యాటింగ్, బౌలింగ్ చేసే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.


ఢిల్లీలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను బుధవారం కలిసి రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పిస్తున్న రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు.

సేవా రంగంలో గ్లోబల్ లీడర్‌గా

దక్షిణ భారతం

● సీఐఐ మాజీ ప్రెసిడెంట్ శోభన



ప్రసంగిస్తున్న శోభనా కామినేని

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, సేవా రంగంలో దక్షిణ భారతదేశం గ్లోబల్ లీడర్ పాత్ర పోషిస్తోందని సీఐఐ మాజీ ప్రెసిడెంట్, అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభనా కామినేని అన్నారు. తాజాగా నగరంలో జరిగిన సీఐఐ మిస్టిక్ సౌత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలు, ఆవిష్కర్తలను ఒక చోట చేర్చిన ఈ శిఖరాగ్ర సమావేశం దక్షిణ భారతదేశానికి ఆర్థిక వృద్ధి, ఆరోగ్య సంరక్షణలో డైనమిక్ శక్తిగా అవతరింపజేస్తుందన్నారు. దేశ జీడీపీలో 31 శాతం వాటాను దక్షిణ భారతదేశం కలిగివుందని ఆమె గుర్తు చేశారు. ప్రపంచానికి 20 శాతం ఫార్మాస్యూటికల్స్‌ను మన దేశం నుంచే ఎగుమతవుతున్నాయన్నారు. ఐటీ సర్వీసులు, బయోటెక్నాలజీ రంగాల్లో ఇతర దేశాలతో పోల్చితే ముందంజలో ఉన్నట్టు ఆమె వెల్లడించారు.

చెన్నై కొళత్తూరులో ప్రజలకు పలురకాల సంక్షేమ పథకాలను అందజేసిన తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాళ్లూరు సురేష్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుందగై



ప్రజా గ్రీవెన్స్‌లో 19 వినతులు

వేళచ్చేరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, నగరవాసులు తమ సమస్యలు చెప్పుకునేందుకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ అరుణ్ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజల నుంచి 19 వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను విచారించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు.


సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్


అన్నా సెంటినరీ లైబ్రరీలో బుధవారం రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పాఠశాల విద్యాశాఖమంత్రి అన్బిల్ మహేష్


చెన్నై అశోక్‌నగర్ జంక్షన్‌లో ఉన్న పురాతన సినీ థియేటర్ కాంప్లెక్స్‌ను బుధవారం కూల్చివేస్తున్న దృశ్యం





అలిపిరి మెట్లోత్సవం

అలిపిరి పాదాల మండపం వద్ద బుధవారం తెల్లవారుజామున మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్.ఆనందతీర్థాచార్య మెట్లపూజ నిర్వహించి ఉత్సవం ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి మెట్లోత్సవం విశేషాన్ని సభ్యులకు వివరించారు. అనంతరం స్వామి సంకీర్తనలు ఆలపిస్తూ వీరంతా తిరుమల కొండకు నడచి చేరుకున్నారు. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కన్నులపండువగా

మాఘ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం మాఘమాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని శ్రీవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





తిరుమల కొండల్లో..

వేడుకగా రామకృష్ణతీర్థ ముక్కోటి





తిరుమల శేషాచల అడవుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి బుధవారం వేడుకగా జరిగింది. ప్రతిఏడాది మాఘ మాసంలో పౌర్ణమినాడు శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 11 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం, తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.ఇక తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను శ్రీవారిసేవకులు అందజేశారు. అలాగే టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మార్గ మధ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఇంజినీరింగ్, ఫారెస్ట్ విభాగాలు సౌకర్యాలను కల్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





స్వామి అమ్మవార్లకు, త్రిశూలానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి క్షేత్రంలో..

ఆగమోక్తంగా త్రిశూల స్నానం





త్రిశూలంతో వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద స్వర్ణముఖి నదిలో బుధవారం ఆగమోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. మహాశివరాత్రికి 15 రోజుల ముందు మాఘపౌర్ణమి వస్తుంది. ఆ రోజున త్రిశూలస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండు రోజుల ముందు నుంచే స్వర్ణముఖి నదిలో పవిత్రజలాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లు, వినాయక స్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చారు. నది వద్ద స్వామి అమ్మవార్లను ఉంచి సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులు కూడా నదిలో మునిగారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, వేదపండితులు, బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

■ నేడు వరల్డ్ రేడియో డే

బుల్లిపెట్టె నేస్తం



- కాలానుగుణ మార్పులకు తట్టుకుని..
- ఉనికి పదిలపర్చుకుంటున్న రేడియో

రేడియో..ఒకప్పుడు ఇంటిల్లపాదికీ ఆత్మీయనేస్తం.. ప్రభుత్వానికీ ప్రజల మధ్య సమాచార వారధి.. జాతీయ సమైక్యతకు సారథి..కళాకారులకు పెన్నిధి..ఆబాల గోపాలానికి ఆనందాల విందును పంచిన ఈ మాధ్యమం ఇప్పుడు ఉనికి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా బాణీ మార్చుకుంటోంది. తన ప్రియ శ్రోతలను అలరించేందుకు ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. వినండి..వినండి.. వింటూనే ఉండండంటూ ఆహ్వానం పలుకుతోంది.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న రేడియో 1980 దశకం తర్వాత టీవీల రంగప్రవేశంతో నెమ్మదిగా ప్రజాదరణకు దూరమైంది. అందరికీ బంధువుగా నిలిచిన మాధ్యమం ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదురైంది. అయితే కొన్నేళ్లుగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉనికి పదిలపర్చుకోడానికి కృషి చేస్తోంది. రేడియో డిజిటల్ విప్లవంగా పరిణామం చెందుతోంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్, పాడ్‌కాస్ట్‌లు, ఉపగ్రహ రేడియోల పెరుగుదల రేడియో కంటెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. డిజిటల్ మీడియా పెరుగుతున్నా ఈ బుల్లి మాధ్యమం శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనంగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మొబైల్ నెట్‌వర్క్ పనిచేయనప్పుడు రేడియో కీలకమైన సమాచార సాధనంగా ఉపకరిస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రభావిత వర్గాలను చేరుకోవడానికి ప్రభుత్వాలు, ఎన్జీవోలు రేడియోపై ఆధారపడుతున్నాయి. కమ్యూనిటీ రేడియో స్టేషన్లు స్థానిక వార్తలను ప్రసారం చేయడం, సామాజిక సమస్యలను చర్చించడం, స్థానిక సంస్కృతి, సంగీతాన్ని ప్లే చేయడంద్వారా లక్షలాది మందికి రేడియో చేరుకుంటోంది. పాడ్‌కాస్ట్‌లు, ఆడియోబుక్‌లు, ఆన్‌లైన్ టాక్ షోలు యువతరాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికీ ప్రధాని మోదీ మన్‌కీబాత్ పేరిట దేశ ప్రజలతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కమ్యూనిటీ రేడియో వ్యవస్థ కూడా ఆదరణ పొందగలుగుతోంది.

● చిన్నప్పటి నుంచి రేడియో ప్రభావం

ఆరోతరగతి నుంచీ రేడియోకు అలవాటు పడ్డాం. పాటలు వింటూ స్కూల్‌కు రెడీ అయ్యేవాళ్లం. రాత్రి పాటలు వింటూ పడుకునేవాళ్ళం. ఆదివారమైతే రేడియోలో నాటకాలు వచ్చేవి. ఆసక్తిగా వినేవాళ్ళం. ఇప్పుడు కూడా ఉదయం నిద్రలేచింది మొదలు డ్యూటీకి రెడీ అయ్యేవరకు రేడియో ఆన్‌లోనే ఉంటుంది. సాయంత్రం ఇంటికి వచ్చాక మళ్లీ రేడియో ఆన్ చేసి ఆకాశవాణి వార్తలు వినడం అలవాటు.

- డాక్టర్ ఏవై లక్ష్మి, ప్రొఫెసర్, స్విమ్స్ రేడియాలజి విభాగం



తిరుపతిలోని ఆకాశవాణి కేంద్రం



● అభిరుచికి అనుగుణంగా మార్పులు




కాలానుగుణంగా అభిరుచి మేరకు కార్యక్రమాలను అందిస్తున్నాం. తిరుపతి ఆకాశవాణి పరిధిలో మంచి శ్రోతలు ఉన్నారు. బయటపడరు. ఉదయం 5.53 గంటలకు సిగ్నేచర్ ట్యూన్‌తో మొదలై 6 గంటలనుంచి ప్రబోధగీతం, వార్తలు, సూక్తిముక్తావళి, పొలం కబుర్లు, ప్రాంతీయ వార్తలు, ఉదయరాగం (సినిమా పాటలు) ఉంటాయి. 7.15 గంటలకు ప్రభాతరేఖల్లో హెల్త్, పొయిట్రీ, షార్ట్ స్టోరీస్, ప్రభుత్వ స్కీమ్స్, ఇంటర్వ్యూ ప్రసారాలు ఉంటాయి. హలో ఆకాశవాణి వాట్సప్ చిత్రం, లిజనర్స్ పాటలు, వనితా లోకం, యువవాణి, బాలానందం,కిసాన్ వాణి వంటి కార్యక్రమాలకు ఆదరణ ఉంది.

- మోహన్ సుధాకర్, ఏడీ, ఆకాశవాణి తిరుపతి

● రేడియో నా నేస్తం

1964నుంచి రేడియో ప్రసారాలు వింటున్నాను. అప్పుడు నా వయస్సు 30 ఏళ్లు. ఇప్పుడు 92 ఏళ్లు వచ్చినా రేడియోను వదలిపెట్టలేదు. అదేనా ఫ్రెండ్. ఉదయం సుప్రభాతంతో మొదలై వార్తలు, నిపుణుల సలహాలు, రాత్రి పడుకునే ముందు లలిత సంగీతం వింటూ పడుకుంటాను. రాష్ట్ర విభజనానంతరం కూడా తిరుపతి రిలే స్టేషన్‌గానే ఉంది. ఇప్పటికైనా మెయిన్ స్టేషన్‌గా మార్చాలి.



- టి.సుబ్బన్న, రైల్వే విశ్రాంత ఉద్యోగి, తిరుపతి

ముగ్గురు అంతర్రాష్ట్ర

దొంగల అరెస్టు

- రూ.25 లక్షల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే ముగ్గురు దొంగలను తిరుపతి, తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు నగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెహిదీపట్నంకు చెందిన సుధాకర్ అలియాస్ ఆంథోని, రంగారెడ్డి జిల్లాకు చెందిన పిల్లిశేఖర్, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గాజులపల్లి శ్రీనివాసులురెడ్డి మంచి స్నేహితులు. వీరిలో సుధాకర్‌పై 100కుపైగా, పిల్లి శేఖర్ పైన 160కిపైగా దొంగతనం కేసులున్నాయి. ఈ ముగ్గురు కలిసి ఇటీవల తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లె పంచాయతీ తిరుమల నగర్‌లోని రవి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, నగదు అపహరించుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకునేందుకు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు అరుణ, జగన్నాథరెడ్డి, సాయినాథ్ చౌదరి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తిరుపతి ఆర్టీవో కార్యాలయం వద్ద తిరుగుతున్న సుధాకర్, పిల్లి శేఖర్,గాజులపల్లి శ్రీనివాసులురెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని అభినందించారు.

ముగ్గుల పోటీల మహిళలకు

రూ.5.56 లక్షల పంపిణీ

చంద్రగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజున సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు రూ.10,116 చొప్పున రూ.5,56,380 బుధవారం పంపిణీ చేశారు. ఏటా నారావారిపల్లెలో ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు గ్రామాల మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలను భువనేశ్వరి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేస్తారు. గతనెలలో ముగ్గుల పోటీల్లో 55మంది ముగ్గులు వేశారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం టీటీడీ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.10,116 వంతున వారందరికీ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోదండరామానాయుడు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ భర్త గిరినాయుడు, నిరంజన్‌నాయుడు, శేఖర్‌నాయుడు, కుమార్, వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే కూటమి

ఘన విజయం సాధిస్తుంది

- ఎండీఎంకే నేత ప్రేమలత జోస్యం



జెండావందనం చేస్తున్న ప్రేమలత, పార్టీ నాయకులు

అడయార్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత జోస్యం చెప్పారు. డీఎండీకే జెండా (ఫ్లాగ్ డే) ఆవిష్కరించి 25 యేళ్ళు అయిన సందర్భంగా కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, డీఎండీఎంకే ఫ్లాగ్ డేను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు నిర్వహించారన్నారు. 2000 సంవత్సరంలో తమ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత కెప్టెన్ విజయకాంత్ ఈ పతాకాన్ని ఆవిష్కరించారన్నారు. అప్పటి నుంచి ప్రతి యేటా ఫిబ్రవరి 12వ తేదీన ఫ్లాగ్ డే జరుపుకుంటున్నామన్నారు. అన్నాడీఎంకే కూటమి ఆవిర్భావ సమయంలోనే తమకు ఒక రాజ్యసభ సీటు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అందువల్ల తమ పార్టీ తరపున రాజ్యసభకు పంపే నేత పేరును త్వరలోనే వెల్లడిస్తామన్నారు. 2026లో అన్నాడీఎంకే కూటమి మళ్ళీ అధికారంలోకి వస్తుందన్నారు. అయితే, విజయ్ పార్టీలో తమ పార్టీ పొత్తు పెట్టుకుంటుందా లేదా అనే ప్రశ్నకు విజయ్‌నే అడగాలన్నారు. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే ఉందన్నారు. అన్నాడీఎంకేలో ఉన్న అంతర్గత సమస్యపై తాను స్పందించబోనని ఒక ప్రశ్నకు ప్రేమలత సమాధానమిచ్చారు.